క్లుప్తంగా

ఆయిల్ వేస్ట్ తొలగించండి



లారీల నుండి వ్యర్థాల డంపింగ్

గంగాధరనెల్లూరు: మండలంలోని ఓ గ్రానైట్ ఫ్యాక్టరీలోని ఆయిల్ వేస్ట్‌ను, వ్యర్థాలను వెంటనే తొలగించాలని ఎంపీడీఓ హరిప్రసాద్‌రెడ్డి హెచ్చరించారు. మండలంలోని పెద్ద కాల్వ గ్రామ పంచాయతీ చెర్లోపల్లి హరిజనవాడ సమీపంలో మూతపడి ఉన్న ఓ ప్రైవేటు గ్రానైట్ ఫ్యాక్టరీలో వ్యర్థాలు, ఆయిల్ వేస్ట్‌ను లారీల ద్వారా డంపు చేస్తున్నారన్న సమాచారంతో ఆ స్థలానికి చేరుకుని ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి లారీలను పట్టుకున్నారు. ఫ్యాక్టరీ వ్యర్థాలను, ఆయిల్ వేస్ట్ వెంటనే అక్కడ నుండి తొలగించాలని ఫ్యాక్టరీ యజమానులకు ఆదేశాలు జారీ చేశారు. ఇలాంటి కార్యక్రమాలు జరిపితే కఠిన చర్యలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెద్ద కాలువ పంచాయతీ కార్యదర్శి కుమార్, గ్రామస్తులు సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి



అవగాహన కల్పిస్తున్న సర్పంచ్

పాలసముద్రం: మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని శ్రీకావేరిరాజుపురం సర్పంచ్ గాలి మహేష్‌బాబు తెలిపారు. శనివారం సీఎం కండ్రిగలో పంచాయతీ పరిధిలోని హేడింగ్ హెడ్ స్వచ్ఛంద సంస్థ స్టేట్ కోఆర్డినేటర్ రాజేంద్రన్, జిల్లా కోఆర్డినేటర్ క్రిష్ణన్ ఆధ్వర్యంలో మహిళల ఆర్థికాభివృద్ధి, చట్టాలపై అవగాహన కల్పించారు. అతిథిగా విచ్చేసిన సర్పంచ్ గాలి మహేష్‌బాబు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగాలంటే సంఘాల్లో వివిధ రకాల రుణాలు ఇస్తున్నారని తెలిపారు. మహిళ పోలీస్ మాధవి మాట్లాడుతూ సైబర్ క్రైమ్, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్ సరళ, ఐకేపీ సీసీ, సంఘమిత్ర ప్రియాంక, మహిళలు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ట్రైనీ కలెక్టర్

గంగాధరనెల్లూరు: ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ 2025 క్యాలెండరు, స్టిక్కర్లను ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి చేతుల మీదుగా శనివారం ఆవిష్కరించారు. మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పీఆర్‌టీయూ సంఘం నేతల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఎంఈఓలు అంజనేయులుశెట్టి , గుణశేఖర్‌రెడ్డి పీఆర్‌టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.చెన్నకేశవరెడ్డి, శెంజి పురుషోత్తం, గౌరవ అధ్యక్షుడు ఆర్.గంగాధరం, నాయకులు చలపతి, దినకరన్, సి.రమేష్, సి.దేవేంద్ర, బి.చంద్రశేఖర శెట్టి, ఆర్.మోహన్ రెడ్డి, మోహన్‌రెడ్డి, రాజేంద్రరెడ్డి, విజయకుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ క్యాలెండర్..



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

నగరి: ఎస్టీయూ 2025 క్యాలెండర్, డైరీని ఎంఈఓ నమశ్శివాయం ఆవిష్కరించారు. శనివారం మండలంలోని గుండ్రాజుకుప్పం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో క్యాలెండర్లను ఆయన ఆవిష్కరించి, సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ డి.నాగభూషణం నాయుడు, సంఘ సభ్యులు వి.పళని, సి.మోహన్, పి.సింధు, కె. చంద్రయ్య, ఎ.నరసింహులు, డి.మోక్షదాయని, ఎ.జయపాల్, ప్రధానోపాధ్యాయుడు జయానందం పాల్గొన్నారు.

పర్యావరణానికి అత్యంత హాని కలిగించే ప్లాస్టిక్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిషేధాజ్ఞలు ఎప్పటి నుంచో అమలులో ఉన్నాయి. అయితే వాటిని క్షేత్రస్థాయిలో అమలు చేయడంలో అధికారులు విఫలమవుతున్నారు. పుత్తూరు పురపాలక సంఘంలో ఎటు చూసినా కనిపించే పాలిథిన్ కవర్ల వినియోగమే ఇందుకు నిదర్శనం. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చినప్పుడు హడావుడి చేసే అధికారులు ఆపై పట్టించుకోకపోవడంతో ప్లాస్టిక్ వినియోగం షరా మామూలే అవుతోంది.

ప్లాస్టిక్ ప్రళయం



- విచ్చలవిడిగా వినియోగం
- కేంద్ర, రాష్ట్ర నిషేధాజ్ఞలు బేఖాతరు
- 120 మైక్రాన్ల కంటే తక్కువ మందంతో ప్రమాదం
- నిబంధనలు కఠినంగా అమలు చేయాలంటున్న పర్యావరణ నిపుణులు

పుత్తూరు: మానవ మనుగడకు పెను ప్రమాదకారి అయిన ప్లాస్టిక్‌ను నిషేధించాలని, ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్న నినాదాలకే అధికారులు పరిమితమవుతున్నారు. క్షేత్రస్థాయిలో ప్లాస్టిక్ నియంత్రణపై దృష్టి సారించకపోవడంతో పుత్తూరులోని ఏ దుకాణం వద్ద చూసినా ప్లాస్టిక్ కవర్లే దర్శనమిస్తున్నాయి. దీంతో ప్లాస్టిక్ కవర్లలో ప్యాక్ చేసిన వేడి ఆహార పదార్థాలను, ప్లాస్టిక్ కప్పుల్లో టీ, కాఫీలను తీసుకోవడం ద్వారా శ్వాసకోశ, క్యాన్సర్ వంటి ప్రాణాంతక రోగాలను ప్రజలు కొని తెచ్చుకుంటున్నారు. గత ఏడాది జనవరి 1 నుంచి 120 మైక్రాన్ల మందం ఉన్న ప్లాస్టిక్ సంచులకే ప్రభుత్వం అనుమతులిచ్చింది. అంతకన్నా తక్కువ మందం ఉన్న సంచుల క్రయవిక్రయాలపై భారీ జరిమానాలు విధించడంతో పాటు చట్టపరమైన చర్యలు చేపడుతామని హెచ్చరించింది. ఈ మేరకు అన్ని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో అధికారులు దాడులు నిర్వహించి నిషేధిత ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకోవడంతోపాటు జరిమానాలు విధించారు. ఇదంతా మూణ్నాళ్ల ముచ్చటగా మారింది. మూడు నెల లు తిరిగేసరికి మళ్లీ షరామామూలే అంటూ ప్రతి షాపులోనూ నిషేధిత ప్లాస్టిక్ కవర్లు కనిపిస్తున్నాయి. మాంసం దుకాణాలు, పండ్లు, పూలు, కిరాణా, హోటళ్లల్లో ఈ కవర్ల వినియోగం విచ్చలవిడిగా సాగుతోంది. మున్సిపల్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో ప్రభుత్వ ఆదేశాలు నీరుగారిపోతున్నా యి. ఫలితంగా కాలువ లు, చెత్తకుప్పల్లో పాలిథిన్ కవర్లు పేరుకుపోతున్నాయి. ఈ వ్యర్థాలను మూగజీవాలు తిని కడుపులో జీర్ణం కాక మృత్యువాత పడుతున్నాయి. రోజురోజుకు పెరిగిపోతున్న ప్లాస్టిక్ వినియోగం యావత్ మానవాళికి ప్రమాదకరంగా మారి పెద్ద ప్రళయాన్నే సృష్టిస్తుందని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వాలు కఠిన చట్టాలు తీసుకొస్తున్నా, వాటిని క్షేత్రస్థాయిలో అమలు చేయడంతో అధికారులు విఫలం కావడం వా రి బాధ్యతారాహిత్యాన్ని తెలియజేస్తోంది. బాధ్యతతో నిబంధనలు పాటించాల్సిన ప్రజలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో పరిస్థితి ఆందోళనకరంగా మారు తోంది. ఇకనైనా అందరూ కలిసి కట్టుగా నిషేధిత ప్లాస్టిక్ వినియోగం విడిచిపెట్టి, గుడ్డ సంచులు వినియోగిస్తూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.



అరటి పండ్ల వ్యాపారం వద్ద..

ప్లాస్టిక్ వదిలితేనే ఆరోగ్యం



ప్లాస్టిక్ కవర్లలో ప్యాక్ చేసిన వేడి ఆహార పదార్థాలను తీసుకోవడం ద్వారా విష వాయువులు శరీరంలోకి చేరుతాయి. ఫలితంగా గ్యాస్ట్రిక్, శ్వాసకోశ సమస్యలతో పాటు క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంది. వాడి పడేసిన ప్లాస్టిక్ వ్యర్థాలను తిన్న ఆవులు, బర్రెలు మృత్యువాత పడుతుండడం మనం చూస్తూనే ఉన్నాం. నిషేధిత ప్లాస్టిక్ కవర్లను పూర్తిగా వదిలేస్తేనే ఆరోగ్యానికి మంచిది.

– డాక్టర్ కె.శ్రీనివాసులురెడ్డి, రిటైర్డ్ డిప్యూటీ సివిల్ సర్జన్, పుత్తూరు

ప్రజలు సహకరించాలి



పుత్తూరు మున్సిపాలిటీలో ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేస్తున్నాం. ఇటీవలే మా సిబ్బంది పట్టణంలో తనిఖీలు నిర్వహించి జరిమానాలు విధించారు. ఇంకా అక్కడక్కడా నిషేధిత ప్లాస్టిక్ వినియోగం జరుగుతోందని తెలుస్తోంది. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకొంటాం. ప్రభుత్వ ఆదేశాల అమలులో భాగంగా ప్రజలు సైతం స్వచ్ఛందంగా ప్లాస్టిక్ రహిత సంచులు వినియోగిస్తూ సహకరించాలి.

– ఎం.మంజునాథ్ గౌడ్, మున్సిపల్ కమిషనర్, పుత్తూరు.

సస్యరక్షణ చర్యలు చేపట్టండి

నింద్ర: వరి, వేరుశనగ పంటలను ఆశించే చీడపీడల నివారణకు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి తులసీరాం తెలిపారు. శనివారం మండలంలోని ఎలకాటూరు గ్రామంలో వేరుశనగ, వరి పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు మందులు పిచికారీ చేయాలని కోరారు. వేరుశనగ పంటకు ఆశించిన పచ్చపురుగు, లద్దెపురుగులను నివారించాలని సూచించా. వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సర్వే త్వరితగతిన పూర్తి చేయాలి



సర్వేను తనిఖీ చేస్తున్న ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి

గంగాధరనెల్లూరు: సహకార సంఘ ఓటర్లకు సంబంధించిన, మండలంలోని హౌస్ హోల్డ్ సర్వే చేయని వారిని గుర్తించి త్వరితగతిన పూర్తి చేయాలని ట్రైనీ కలెక్టర్ హిమవంశీ అన్నారు. జీడీ నెల్లూరులో నమోదు కార్యక్రమాన్ని ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి శనివారం ప్రత్యక్షంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సర్వేను పక్కాగా నిర్వహించాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు చంద్ర(జీడీ నెల్లూరు), దుర్గాప్రసాద్(వేల్కూరు), కిరణ్‌కుమార్(ముక్కలత్తూరు), డి.కుమార్(పెద్ద కాల్వ), గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ విధిగా ధరించాలి



మాట్లాడుతున్న డీఎస్పీ రవికుమార్



ర్యాలీలో పాల్గొన్న పోలీస్ సిబ్బంది

పుత్తూరు: అతివేగం అనర్థాలకు మూలమని, దీన్ని నియంత్రించడానికి హెల్మెట్ రక్షణ కవచంగా నిలుస్తుందని డీఎస్పీ జి.రవికుమార్ పేర్కొన్నారు. శనివారం జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు ఆదేశాల మేరకు పట్టణంలో హెల్మెట్ వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ హెల్మెట్ వినియోగంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన 3,703 ప్రమాదాల్లో 3,042 మరణాలు హెల్మెట్ ధరించకపోవడం ద్వారా సంభవించినట్లు ఒక సర్వేలో తేలిందని వెల్లడించారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ రూల్స్‌ను విధిగా పాటించాలని సూచించారు. రోడ్డు మరణాలను నియంత్రించడంలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐ కేబీ సురేంద్రనాయుడు, డివిజన్ పరిధిలోని ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



సమావేశంలో వన్నెకుల క్షత్రియ నాయకులు

కార్వేటినగరం: ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఆర్కేఎస్సార్ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. అనంతరం కళాశాలలో అదనపు గదులు నిర్మించాలని కళాశాల ప్రిన్సిపల్ స్వరూప కోరడంతో రూ.25 లక్షలు ప్రభుత్వం మంజూరు చేస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ స్వరూప, మండల విద్యాశాఖ అధికారులు విజయకుమార్, మనోజ్‌కుమార్, విద్యార్థులతో కలసి ఎమ్మెల్యే సహపంక్తి భోజనం చేశారు.

అర్హులకే పదవి ఇవ్వాలి

రాష్ట్ర వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పదవిని అర్హులకే ఇవ్వాలని ఆ సంఘం నాయకులు శనివారం ఎమ్మెల్యే థామస్‌కు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ వన్నెకుల క్షత్రియ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ రాజేంద్రరెడ్డి తమ కులం కాదని, అగ్రకులానికి చెందిన వాడని వినతిలో తెలిపారు. ఆయన్ను డైరెక్టర్ పదవి నుంచి తొలగించి నిజమైన అర్హులకు అందేలా చర్యలు తీసుకోవాలని ఆ సంఘం నాయకులు ఎమ్మెల్యేను కోరారు.

దళితులపై దాడి చేసినవారిని అరెస్టు చేయాలి



కృపాలక్ష్మి

శ్రీరంగరాజపురం: దేశం మొత్తం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం అమలవుతుంటే రాష్ట్రాన్ని మాత్రం రెడ్‌బుక్ రాజ్యాంగం పాలిస్తోందని వైఎస్ఆర్ సీపీ గంగాధరనెల్లూరు ఇన్‌చార్జి కృపాలక్ష్మి అన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళలు, బాలికలపై దాడులు, అఘాయిత్యాలు రోజురోజుకి పెరిగిపోతున్నాయని అన్నారు. ఇందుకు నిదర్శనమే నగరి నియోజకవర్గం తడుకుపేటలోని దళితులపై దాడులని తెలిపారు. దళితులు ఆత్మగౌరవంతో వీధుల్లో చెప్పులు వేసుకొని నడవకూడదా.. అని ప్రశ్నించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, హోం మంత్రి అనిత ఇంత వరకు దాడులు చేసిన వారిపై చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. దాడులు చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ప్రజాసంఘాలు, మేధావులు, వివిధ రాజకీయ పార్టీలతో కలసి రాష్ట్రం వ్యాప్తంగా నిరసన, ధర్నాలు చేసి బాధితులకు అండగా ఉంటామన్నారు.

గోపాలమ్మ మృతికి నివాళి



గోపాలమ్మకు నివాళులర్పిస్తున్న కృపాలక్ష్మి

పెనుమూరు(కార్వేటినగరం): పెనుమూరు మండలం గుడ్యాణంపల్లి పంచాయతీ కండిగ గ్రామానికి చెందిన వైఎస్ఆర్ సీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ సి.సుధాకర్‌రెడ్డి తల్లి గోపాలమ్మ(78) అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం రాత్రి మృతి చెందారు సమాచారం అందుకున్న వైఎస్ఆర్ సీపీ గంగాధరనెల్లూరు నియోజకవర్గం సమన్వయకర్త కళత్తూరు కృపాలక్ష్మి గ్రామానికి వెళ్లి గోపాలమ్మ మృత దేహంపై పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబాన్ని ఓదార్చారు. వారి వెంట జడ్పీటీసీ దొరస్వామియాదవ్, మధుసూదన్‌రెడ్డి, దూది వెంకటేష్, నీలా పండరీనాథ్, దూది మోహన్, గిరిధర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

కిశోర బాలికల సంరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న కమిషనర్ మంజునాథ్‌గౌడ్

పుత్తూరు: కిశోర బాలికల సంరక్షణ అందరి బాధ్యతని మున్సిపల్ కమిషనర్ ఎం.మంజునాథ్ గౌడ్ స్పష్టం చేశారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పట్టణ పరిధిలోని అప్పర్ ప్రైమరీ స్కూల్స్ టీచర్లకు, జూనియర్ కాలేజీ లెక్చరర్లకు, వార్డు వెల్ఫేర్ అసిస్టెంట్లకు, మహిళా సంరక్షణ కార్యదర్శులకు, అంగన్‌వాడీ టీచర్లకు ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ డ్రాపౌట్ విద్యార్థులు లేకుండా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఇదివరకే బడి మానేసిన యుక్త వయస్సు పిల్లలను గ్రూప్స్‌గా ఏర్పాటు చేసి స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా ఉపాధి అవకాశాలను కల్పించాలని సూచించారు. సీఐ కేబీ సురేంద్రనాయుడు మాట్లాడుతూ యువత సైబర్ క్రైమ్ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు వహించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జి.సి.వెంకటేశ్వర్లు, సీడీపీఓ సంధ్య, ఎంఈఓ తిరుమలరాజు, మెడికల్ ఆఫీసర్ రమేష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు గీతాంజలి, అనిత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బ్రెయిలీ దినోత్సవం



నగరి: మాట్లాడుతున్న ఎంఈఓలు

విజయపురం: మండలం కేంద్రంలో ప్రపంచ బ్రెయిలీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం ఎంఈఓ హరిప్రసాద్ వర్మ ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా దృష్టి లోపంతో జీవితం గడుపుతున్న వారికి ఈ రోజు ఎంతో ప్రత్యేకమైనదన్నారు. లూయీ బ్రెయిలీ అనే మహనీయుని పుట్టినరోజు సందర్భంగా బ్రెయిలీ దినోత్సవాన్ని జరుపుకుంటారని గుర్తు చేశారు. ఈయనే బ్రెయిలీ లిపిని ఆవిష్కరించారని, బ్రెయిలీ లిపి అనేది అంధులు చదవడానికి, రాయడానికి ఉపయోగించే భాష అని తెలిపారు. కంటి చూపు కోల్పోయిన వారు చదువుకు దూరం కాకుండా ఉండేందుకే ఈ బ్రెయిలీ లిపిని రూపొందించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పన్నూరు హెచ్‌ఎం జానకిరామిరెడ్డి, ఇన్‌చార్జీ హెచ్‌ఎం మనోజ్‌కుమార్, ఐఈఆర్‌పీ శివకుమార్, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

వడమాలపేట: మండల కేంద్రంలోని భవిత పాఠశాలలో శనివారం బ్రెయిలీ డేను ఘనంగా నిర్వహించారు. అంధులను కూడా మన సమాజంలో ఒక్కరిగా గుర్తించాలని ఎంఈఓ పద్మావతి అన్నారు. ఈ కార్యక్రమంలో సెకండ్ ఎంఈఓ తులసిరామ్, హెచ్‌ఎం దీనకుమార్, హేమలత, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

నింద్ర: మండల కేంద్రమైన నింద్ర భవిత కేంద్రంలో శనివారం ప్రపంచ లూయీ బ్రెయిలీ దినోత్సవం నిర్వహించారు. ఎంఈఓలు వసుమతి, శ్రీధర్‌రాజు పాల్గొన్నారు. వారు మట్లాడుతూ ఎందరో అంధుల విద్యాభివృద్ధికి బ్రెయిలీ లిపి ఉపమోగపడుతుందని తెలిపారు. ఈ లిపినే చుక్కల లిపిఅని అంటారని అన్నారు. ఈ సందర్భంగా పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో సహిత ఉపాధ్యాయులు వాసు, వేంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

నగరి: అంధులపాలిట వెలుగురేఖ బ్రెయిలీ అని ఎంఈఓలు శ్రీదేవి, నమశ్శివాయం అన్నారు. ప్రపంచ బ్రెయిలీ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం స్థానిక భవిత కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ చూపు లేనివారి కోసం ఆరు చుక్కల లిపిని కనుగొన్నారని వివరించారు. ఈ సందర్భంగా గుణశేఖర్ అనే దాత రూ.5 వేలు విలువైన జారుడు బల్లను విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని పార్వతీదేవి, మాజీ ఎంఈఓ జయచంద్రారెడ్డి, ఐఈడీఎస్‌ఎస్‌లు పి.సంగీత, పి.భవాని, ఎం.సంతోష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పాలసముద్రం: ప్రభుత్వం భవిత కేంద్రంలో దివ్యాంగుల పిల్లలకు ఉత్తమ విద్యను అందిస్తున్నారని ఎంఈఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు. శనివారం సహిత ఉపాధ్యాయిని విమలరాజు ఆధ్వర్యంలో ప్రపంచ అంధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన ఎంఈఓ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ అంధుల కోసం లూయీ బ్రెయిలీ ప్రత్యేక లిపిని కనుక్కొని అందరికీ మార్గదర్శనం అయ్యాడని తెలిపారు. బ్రెయిలీ లిపిపై పిల్లలకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు పలు క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఏపీ అంధ ఉద్యోగుల సంఘం చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షుడు నల్లారి నరేష్, ఉపాధ్యాయులు జమున, దివ్యాంగుల పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురం: మండలంలోని స్థానిక భవిత కేంద్రంలో లూయీ బ్రెయిలీ జయంతిని ఎంఈఓ అరుణాచలం రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

మధ్యాహ్న భోజనం ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ

నగరి: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఆర్డీఓ భవానీ శంకరి శనివారం ప్రారంభించారు. విద్యార్థులకు ఆమె స్వయంగా భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ వెంకటాచలపతి, ఎంఈఓలు శ్రీదేవి, నమశ్శివాయం, ఎండీఎం ఇన్‌చార్జి జ్ఞానశేఖర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నింద్ర: ప్రభుత్వం ప్రకటించిన ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకం కార్యక్రమాన్ని నింద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ శ్రీధర్ రాజు పరిశీలించారు. విద్యార్థులకు భోజన వసతిని ఆయన పరిశీలించారు. ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అన్నం వడ్డిస్తున్న ప్రిన్సిపల్, ఎంఈఓ

పాలసముద్రం: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. పాలసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు సమావేశంలో ఎంఈఓ గిరిజ, ప్రిన్సిపల్ హేమలత మాట్లాడుతూ కళాశాలకు సక్రమంగా విద్యార్థులను పంపించాలన్నారు. ప్రభుత్వం కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన వసతి కల్పిస్తోందని తెలిపారు. అనంతరం మధ్యాహ్న భోజనం పథకాన్ని ప్రారంభించారు.